


19 వ వసంతంలోకి ...
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
ఆదివారం 15 మార్చి 2026


# పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

**పప్పుల మిల్లు వద్ద ప్రజలకు ఇబ్బందులు లేకుండా రైల్వే వంతెన నిర్మాణం**

**విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు స్పష్టం**



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** సెంట్రల్ నియోజకర్గంలో గత ప్రభుత్వం పట్టించుకోని రైల్వే పెండింగ్ ప్రాజెక్టులన్నీ త్వరితగతిన పూర్తి చేసి చూపుతామని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. 1వ డివిజన్ మధురానగర్ పప్పుల మిల్లు సెంటర్లోని రైల్వే గేటు ప్రాంతాన్ని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు రైల్వే, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆర్ యు బి, ఆర్ ఓ బి నిర్మాణ విషయమై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) మాట్లాడుతూ...2019-24 మధ్యకాలంలో విజయవాడ నగర అభివృద్ధి అటకెక్కిందన్నారు. నాటి పాలకులు దోచుకోవడమే తప్ప అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా నేను, ఎమ్మెల్యేగా బోండా ఉమామహేశ్వరరావు గెలిచిన తర్వాత సెంట్రల్ నియోజకవర్గంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించామని ఎంపీ శివనాథ్ తెలిపారు. గుణదలలో ఎల్ సి గేట్ నంబర్ 8, 316 పెండింగ్ ప్రాజెక్టులు మంజూరుకు చర్యలు తీసుకున్నామని, అదేవిధంగా వాంబే కాలనీ - మధురానగర్ మధ్య ఆర్ యు బి మంజూరు చేయించామన్నారు. కొత్త రాజరాజేశ్వరి పేట - పాత రాజరాజేశ్వరి పేట మధ్య రైల్వే వంతెన నిర్మాణం, మధురానగర్ పప్పుల మిల్లు రైల్వే గేటువద్ద ప్రజలెవ్వరికీ ఇబ్బంది లేకుండా ఆర్ యు బి లేదంటే ఆర్ ఓబి నిర్మాణం జరిగేలా చూస్తున్నామన్నారు. అందుకు సాధ్యాసాధ్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులతో కలిసి వచ్చినట్లు తెలిపారు. గుణదల ప్రాంత అభివృద్ధిని ఆ ప్రాంతంలో మిగతా 2లో...



# వంటగ్యాస్ కొరత లేదు

**కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చర్యలు తప్పవు**

**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)** 2

ఉగాది రోజున

# సొంతింటిలోకి సగర్వంగా!

**గృహ ప్రవేశాలకు సిద్ధంగా జక్కంపూడిలో 2,256 టిడ్కో ఇళ్లు**

**అన్ని సౌకర్యాలతో ఆహ్లాదకరంగా నివాసాలు**

**సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**విజయవాడ బ్యూరో, మార్చి 14, మేజర్ న్యూస్ :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని లబ్ధిదారులు తమ సొంతింటిలోకి సగర్వంగా అడుగుపెట్టేందుకు వీలుగా జక్కంపూడిలో నిర్మించిన 2,256 టిడ్కో ఇళ్లు సిద్ధంగా ఉన్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన గృహ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈ ఇళ్ల నిర్మాణం 2

9వ తరగతి విద్యార్థులను 10వ తరగతికి

# సిద్ధం చేయాలి

- ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రత్యేక అధికారులు దృష్టి పెట్టాలి
- కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం 10వ తరగతికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ నగరంలోని తన క్యాంప్ కార్యాలయం నుండి విద్యాధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రత్యేక అధికారులతో మిగతా 2లో

## వంట గ్యాస్ కొరత లేదు

**కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చర్యలు తప్పవు**

**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత లేదని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) స్పష్టం చేశారు. విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ....గ్యాస్ సిలిండర్ల విషయంలో వినియోగదారులెవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి గ్యాస్ సిలిండర్లను బ్లాక్ లో విక్రయించాలని చూస్తే చర్యలు తప్పవన్నారు. కొరత పేరుతో ఎవరైనా బ్లాక్ మార్కెట్ లో గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ విషయాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేనివిధంగా ఇరాన్ నుంచి స్ట్రేయిజ్ కెనాల్ ద్వారా గ్యాస్ లోడు భారత్ కు వస్తోందన్నారు. దేశంలో గృహ వినియోగానికి ఎక్కడా కూడా గ్యాస్ కొరత తలెత్తదన్నారు. ప్రత్యేకించి ఎన్టీఆర్ జిల్లాలో ఐఓసీ, బీపీసీఎల్ తదితర గ్యాస్ పంపిణీ సంస్థల పనితీరును నిరంతరం పరిశీలిస్తున్నామని, ఆయా సంస్థల్లో ఎన్నెన్ని గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉంటున్నాయో పరిశీలించి ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పంపిణీ చేస్తాం అని స్పష్టం చేశారు. గ్యాస్ కొరత వదంతులను ఎవరూ నమ్మి భయపడవద్దు అన్నారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ లోనూ ఇబ్బందులు లేకుండా చూస్తాం అని ఎంపీ శివనాథ్ తెలిపారు.

### ఇఫ్తార్ విందు వేదిక మార్పు..



**విజయవాడ, మార్చి 14, మేజర్ న్యూస్ :** ఈ నెల 16వ తేదీన పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఇఫ్తార్ విందు కార్యక్రమం గతంలో నిర్ణయించిన విధంగా విజయవాడలోని ఏ1-కన్వెన్షన్ సెంటర్‌లో కాకుండా ఏ-ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఇఫ్తార్ విందు కార్యక్రమానికి సంబంధించిన వేదిక మార్పు చేయడం జరిగిందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఇఫ్తార్ విందులో పాల్గొనే మత పెద్దలు, ముస్లిం సోదరులు, ప్రజాప్రతినిధులు వేదిక మార్పును గమనించి ఏ ప్లస్ కన్వెన్షన్‌కు హాజరు కావాలని ఆయన కోరారు. ఇందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఇఫ్తార్ విందుకు రాష్ట్రస్థాయి ప్రజాప్రతి నిధులు, మత పెద్దలు, వివిధ వర్గాల ప్రతినిధులు, ప్రముఖులు హాజరు కానున్నారని ఈ నేపథ్యంలో కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉం డకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమ వేదిక వద్ద పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, శుద్ధమైన తాగు నీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, అతిథులు కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అతిథులు సౌకర్యవంతంగా కార్యక్రమంలో పాల్గొనే విధంగా అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తిచేయాలని తెలిపారు. ముస్లిం సోదరులకు పవిత్రమైన రంజాన్ మాసం నేపథ్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా, సోదరభావాన్ని పెంపొందించేలా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ సీఈవో యాకూబ్ భాషా, విజయవాడ ఆర్‌డీవో టి.వి.సతీష్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, ప్రోటోకాల్ డైరెక్టర్ టి.మోహన్‌రావు, వక్ఫ్ బోర్డు అధికారులు ఆదం షఫి, మస్తాన్ కరీముల్లా పాల్గొన్నారు.

### విద్యార్థిగా మారిన ఎంపీడీఓ ఇమ్రాన్



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** మనమంతా నిత్య విద్యార్థులం అనేందుకు గుడ్లవల్లేరు ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ నిదర్శనం. శనివారం మండలంలోని కౌతవరం ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నిర్వహించిన గూగుల్ సమావేశంలో ఎంపీడీఓ ఇమ్రాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలకు క్రమశిక్షణతో సిద్ధమై మంచి ఫలితాలు సాధించాలని సూచనలు చేశారు.

# పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)



నాయకులని చెప్పుకునే వాళ్ళు పట్టించుకోలేదన్నారు. పేరుకే గొప్పలు చెప్పుకుంటూ గుణదల ప్రాంత అభివృద్ధికి తట్టెడు మట్టి కూడా వేయని కొందరు నాయకులు అక్కడ ఉన్నారన్నారు. ఎమ్మెల్యే బోండా ఉమా సారథ్యంలోనే నియోజకవర్గ పరిధిలోని గుణదల ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. 2029 ఎన్నికలు నాటికి నియోజకవర్గంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేసేలా చూస్తామని, గత ప్రభుత్వ చేతకానితనాన్ని, కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలకు చూపిస్తామన్నారు. ప్రభుత్వ విప్, సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ...2024లో ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. ప్రధానంగా గత పాలకులు పట్టించుకోకుండా వదిలేసిన పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. 2009లో గుణదల ఆర్‌ఓబి పనులు నాటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రారంభమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు నాడు అందిన కాడికి దోచుకున్నారన్నారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల దెబ్బకు ఆర్‌ఓబి నిర్మాణ కాంట్రాక్టర్ సైతం పారిపోయాడన్నారు. 2014 టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కాంట్రాక్టర్ కోర్టులో కేసు వేయడంతో గుణదల ఆర్‌ఓబి నిర్మాణ విషయాన్ని నాడు పట్టించుకోవడం సాధ్యపడలేదన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ కోర్టుపరమైన ఇబ్బందులు తొలగిపోయినప్పటికీ గుణదల ఆర్‌ఓబి నిర్మాణం విషయాన్ని పట్టించుకోలేదన్నారు. 2024లో ఎంపీగా కేశినేని శివనాద్, ఎమ్మెల్యేగా నేను గెలిచిన నాటి నుంచి రైల్వే పెండింగ్ ప్రాజెక్టుల సమస్యల పరిష్కారం విషయమై పలు దఫాలుగా రైల్వే జీఎం, డిఆర్‌ఎం, ఇతర అధికారులను కలిసామన్నారు. ఢిల్లీ స్థాయిలో ఎంపీ కేశినేని చిన్ని పలు దఫాలు రైల్వే మంత్రిని కలిశారన్నారు. గుణదలలో రెండు ప్రాజెక్టులు 316, గేట్ నెంబర్ 8 వద్ద మంజూరు చేసుకోగలిగామని, 316 గుణదల ఆర్‌ఓబి నిర్మాణ పనులు లోని 15 రోజుల్లో ప్రారంభం అవుతాయన్నారు. గుణదల ఉలవచారు కంపెనీ వద్ద నిలిచిపోయిన గుణదల ఆర్‌ఓబి పనులు పున ప్రారంభిస్తామన్నారు. మధురానగర్ పప్పుల మిల్లు వద్ద స్థానిక ఇళ్ల వాసులకు ఇబ్బంది లేకుండా రైల్వే గేటు వద్ద ఆర్‌ఓబి, లేదంటే ఆర్యుబి నిర్మాణం జరిగేలా చూస్తామని గేటు సమీపంలోని కుటుంబాల వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కార్యక్రమంలో ముందుగా రైల్వే శాఖ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (గతి శక్తి) ఎస్.శ్రీనివాసరావు, నగర పాలక సంస్థ ఈఈ శ్రీనివాసరెడ్డి తదితరులతో పప్పులమిల్లు వద్ద ఆర్‌ఓబీ, లేదంటే ఆర్‌యూబీ నిర్మాణం సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయి సమీక్ష చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రైల్వే గేటు వద్ద వంతెన నిర్మాణం జరిగేలా చూడాలని అధికారులను ఎంపీ, ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు బొప్పన భవకుమార్, 1వ డివిజన్ టిడిపి అధ్యక్షులు సురేష్, నాయకులు, రైల్వే, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

# ఉగాది రోజున సొంతింటిలోకి సగర్వంగా!

(మొదటిపేజీ తరువాయి)



పూర్తయిందని ఆయన పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, టిడ్కో ప్రాజెక్టు డైరెక్టర్ బి.చిన్నోడు తదితరులతో కలిసి జక్కంపూడిలోని టిడ్కో ఇళ్ల ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. నిర్మాణ పనులు పూర్తయిన ఇళ్లలో కల్పించిన మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య వ్యవస్థలు, నీటి సరఫరా ఏర్పాట్లు, రహదారులు, పరిసరాల అభివృద్ధి వంటి అంశాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం నాణ్యతతో పూర్తయిన తీరును గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈ గృహ సముదాయంలో సైట్ ఏలో నివసించే ప్రజలకు తాగునీటి సరఫరా అందించేందుకు 5 లక్షల లీటర్ల ఎలివేటెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయిందని, మిగిలిన సైట్లకు సంబంధించిన 14 లక్షల లీటర్ల ట్యాంకు పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణ కోసం సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)ను కూడా ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు వివరించారు. కాలువలు, డ్రైనేజీ వ్యవస్థలు, విద్యుత్ సదుపాయం, అంతర్గత రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కూడా అందుబాటులో ఉంచడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. లబ్ధిదారులకు సౌకర్యవంతమైన నివాస వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చడంపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు చెప్పారు. జక్కంపూడిలోని సైట్‌ఏలో 23 బ్లాకుల్లో నిర్మించిన 1,104 ఇళ్లు, సైట్‌డిలోని 24 బ్లాకుల్లో నిర్మించిన 1,152 ఇళ్లు మొత్తం 2,256 ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ ఇళ్లలో గృహ ప్రవేశాలు నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే మిగిలిన సైట్‌బి, సైట్‌సి ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో టిడ్కో, మునిసిపల్ ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 9వ తరగతి విద్యార్థులను 10వ తరగతికి సిద్ధం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి 9వ తరగతి విద్యార్థులను 2027 పదవ తర గతి పరీక్షలకు సంసిద్ధతపై మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ 2027 ఎస్ ఎస్ సి బోర్డు పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు 9వ తరగతి నుంచే 10వ తరగతి సిలబస్ పై దృష్టి పెట్టాలని సూచించారు. దీనికోసం ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెబుతూ పలు సూచనలు చేశారు. విద్యార్థులు వేసవి సెలవులను వృధా చేయకుండా నిర్దిష్ట ప్రణాళికతో పదవ తరగతి పాఠ్యాంశాలను చదువుకుంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజు ఉదయం 5 గంటలకే నిద్రలేవటం, రాత్రికి ముందుగానే నిద్రకు ఉపక్రమించటం ఆ మధ్యలో నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలు చదువుకోవడం ద్వారా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని అన్నారు. విద్యార్థులు చదివింది రాయటం, పునఃశ్చరణ చేసుకోవడం ద్వారా సబ్జెక్టు ఎక్కువగా గుర్తు ఉంటుందని చెప్పారు. ఏకాగ్రత కోసం ప్రాణాయామాలు చేయాలని సూచించారు. క్లిష్టమైన సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అవసరం మేరకు ట్యూషన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తమ పిల్లలు ప్రతిరోజు నిద్రలేవటం, సమయానికి పడుకోవడం, తల్లిదండ్రులు అలవాటు చేయాలని, సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచే విధంగా చూడాలన్నారు. పిల్లలు చదువుకునేందుకు కుటుంబంలో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని వారి ముందే తల్లిదండ్రులు తగాదాలు, గొడవలు పడుతూ పిల్లల ప్రశాంతతకు భంగం కలిగించవద్దని, పరిస్థితులకు అనుగుణంగా వారిలో మనోధైర్యం నింపాలన్నారు. బాగా చదువుకునేందుకు పిల్లల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని చెబుతూ వారి పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తల్లిదండ్రులకు సూచించారు. పదవ తరగతి సిలబస్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, తద్వారా పునఃశ్చరణకు సమయం కేటాయించే విధంగా ఉపాధ్యాయులు ప్రణాళిక చేయాలన్నారు.. తరచుగా స్లిప్ టెస్ట్ లు నిర్వహిస్తూ విద్యార్థుల్లో పరీక్షలపై భయం పోగొట్టి భరోసా, ధైర్యం,ఆత్మవిశ్వాసం నింపాలని, ఆయా సబ్జెక్టుల్లో బలహీన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. పై అంశాలపై పూర్తి పర్యవేక్షణ ఉంచడం ద్వారా పదో తరగతి పరీక్షల్లో గొప్ప ఫలితాలు రాబట్టవచ్చని, అద్భుతాలు జరుగుతాయని చెబుతూ, విద్యార్థుల ప్రగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని, అవసరం మేరకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి యు వి సుబ్బారావు, డిప్యూటీ డీఈవోలు, ఎంఈఓ లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రపంచ కిడ్నీ దినోత్సవం 2026

## కిడ్నీ ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచుతున్న అపోలో డయాలసిస్ క్లినిక్స్






**విజయవాడ, మార్చి 13, మేజర్ న్యూస్ :** ప్రపంచ కిడ్నీ దినోత్సవం 2026 సందర్భంగా, భారతదేశపు ప్రముఖ కిడ్నీ కేర్ నెట్‌వర్క్ 'అపోలో డయాలసిస్ క్లినిక్స్' ఆంధ్రప్రదేశ్‌లోని 10జిల్లాల్లో కిడ్నీ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. కిడ్నీ వ్యాధుల నివారణ, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ ప్రచారం ఈ ఏడాది గ్లోబల్ థీమ్ "ప్రజల సంరక్షణ – పర్యావరణ పరిరక్షణ", "స్క్రీన్ ఎర్లీ, లైవ్ హెల్తీ" (ముందస్తు పరీక్ష – ఆరోగ్యకరమైన జీవనం) అనే నినాదంతో సాగింది. ఈ చొరవ ద్వారా వేలాది మంది ప్రజలు కిడ్నీ ఆరోగ్యం, వ్యాధుల ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై విలువైన సమాచారాన్ని అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక కార్యక్రమాలు: ఈ ప్రచారంలో భాగంగా వివిధ జిల్లాల్లో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అదోని: ప్రజలు చురుగ్గా ఉంటూ కిడ్నీ ఆరోగ్యంపై దృష్టి సారించేలా ప్రోత్సహిస్తూ 'వాకథాన్', ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. అమలాపురం: పర్యావరణ సంక్షేమానికి, మానవ ఆరోగ్యానికి ఉన్న సంబంధాన్ని చాటిచెబుతూ స్థానిక ఎమ్మెల్యే భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జగ్గయ్యపేట: 'కోహెన్స్' బృందంతో కలిసి ప్రత్యేక కిడ్నీ అవగాహన, స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. చిత్తూరు: చిత్తూరు ఏరియా ఆసుపత్రిలో 200 మందికి పైగా రోగులకు ఆరోగ్య నిపుణులు ఆహార నియమాలు, జీవనశైలిపై కౌన్సెలింగ్ ఇచ్చారు. మాచర్ల: కె.సి.పి సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల కోసం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి, కిడ్నీ వ్యాధుల ముందస్తు గుర్తింపు, నివారణా జాగ్రత్తలపై వైద్య నిపుణులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలన్నీ ప్రధానంగా మధుమేహం, అధిక రక్తపోటు వంటి రిస్క్ ఫ్యాక్టర్ల గురించి అవగాహన కల్పించడంపై దృష్టి సారించాయి, ఇవే క్రానిక్ కిడ్నీ డిసీజ్ రావడానికి ప్రధాన కారణాలు. ఈ సందర్భంగా అపోలో డయాలసిస్ క్లినిక్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.సుధాకర రావు మాట్లాడుతూ.. "కిడ్నీ వ్యాధులు ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు లేకుండానే వస్తాయి, అందుకే క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. ప్రజలు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని, కిడ్నీ సమస్యలను ముందే గుర్తించాలని మేము కోరుతున్నాము. దేశవ్యాప్తంగా 175 కి పైగా క్లినిక్‌ల ద్వారా ఇప్పటివరకు 50 లక్షలకు పైగా డయాలసిస్ సెషన్లను పూర్తి చేసిన మేము, నాణ్యమైన కిడ్నీ సంరక్షణను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నాము" అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఈ కార్యకలాపాలు అపోలో డయాలసిస్ క్లినిక్స్ దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రపంచ కిడ్నీ దినోత్సవ ప్రచారంలో భాగం. దీని ద్వారా దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో ప్రజలకు స్క్రీనింగ్ క్యాంప్‌లు, వైద్యుల అవగాహన సదస్సులు, రక్తదాన శిబిరాలు, పోషకాహార కౌన్సెలింగ్ ప్రోగ్రామ్‌ల ద్వారా అవగాహన కల్పించారు.

# భక్తుల కోసం చలివేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



**మోపిదేవి మేజర్ న్యూస్ :** శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. వారికి దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి నాగపుట్టలో పాలు పోసి పూజలు చేసిన ఎమ్మెల్యే, గర్భాలయంలో స్వామిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో వేసవి దృష్ట్యా భక్తుల కోసం దేవస్థానం ఆవరణలో, దేవస్థానం నూతన షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట ఏర్పాటుచేసిన రెండు చలివేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్, దేవస్థానం సూపరింటెండెంట్ అచ్యుత మధుసూధనరావు, టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, సనకా ప్రశాంత్, సర్పంచులు నందిగం మేరీరాణి, దిడ్ల జానకీ రాంబాబు, మాజీ సీడీసీ ఛైర్మన్ రావి నాగేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర నాయకులు రావి రత్నగిరి, ఎంపీటీసీ సభ్యులు కొమ్ము పవన్, సనకా వెంకట రాజేష్ బాబు, మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మి, మండల కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, పీఏసీఎస్ అధ్యక్షులు కోసూరు నాగమల్లేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బారావు, బళ్ళ సీతారాం ప్రసాద్, టీసీ అధ్యక్షులు మత్తి నాగమల్లేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్లు మెరకనపల్లి నరేష్, పుప్పాల ఏసు, కూటమి నాయకులు డోకిపర్తి బాలకోటేశ్వరరావు, కొమ్ము పండు, కోసూరు నాగమల్లి, యర్రంశెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించండి



**మొవ్వ మేజర్ న్యూస్ :** నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామాన్ని "నృత్య కూచిపూడి-స్వచ్ఛ సుందర కూచిపూడి"గా తీర్చిదిద్దడానికి నడుం బిగించిన రాష్ట్ర ప్రభుత్వానికి కూచిపూడి గ్రామంలోని పసుమర్తి వారి ధర్మ చెరువు చుట్టూ, కళా పీఠానికి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు (బార్లపూడి) పక్కన ఆక్రమించిన ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించి అభివృద్ధికి సహకరించాలని కూచిపూడి ఎస్.ఐ సి.హెచ్ సురేష్, గ్రామ పంచాయతీ (గ్రేడ్-1) కార్యదర్శి కే పి వి అంకబాబులుసూచించారు. ఈ మేరకు ఆక్రమణదారులు 42 మందితో కూచిపూడి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సమావేశం నిర్వహించి ఆక్రమణల తొలగింపు పై సూచనలు ఇచ్చారు. ఆక్రమణలు తొలగించమనిహైకోర్టు ఉత్తర్వులు ఇచ్చి రెండు సంవత్సరాల అవుతున్నా ఆక్రమణదారులు వ్యాపారం కొనసాగిస్తూ హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ కాలయాపన చేయటం సరికాదని సూచించారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక శాఖ నిధులు మూడు కోట్ల రూపాయల ద్వారా ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి పనులు ప్రారంభించే ఈ తరుణంలో ఆక్రమణదారులు స్వచ్ఛందంగా సహకరించి తొలగించుకోవాలని సూచించారు. హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశానుసారం అతి త్వరలో తొలగిస్తామని ఇప్పటికే హైకోర్టు ఉత్తర్వులిచ్చి రెండు సంవత్సరాలు కాలం పూర్తి కావస్తోందని ఇంకా సమయం లేదని రెండు మూడు రోజుల్లోనే ఖాళీ చేయాలని వారు ఆక్రమణలకు సూచించారు. ఆక్రమణలు తొలగించిన తర్వాత కూచిపూడి ప్రధాన రహదారిపై ఒక ఆహ్లాదకరమైన షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి ఆక్రమణదారులలో సహకరించిన వారికి షాపులు అద్దెలు కూడా ఇచ్చే అవకాశం ఉంటుందని సమావేశంలో పేర్కొన్నారు. సహకరించని ఆక్రమణదారులను బ్లాక్ లిస్టులో నమోదు చేసి వారికి షాపులు అద్దెలు కూడా ఇచ్చే అవకాశం ఉండదని సమావేశంలోఎస్.ఐ సురేష్, కార్యదర్శి అంకంబాబులు స్పష్టం చేశారు. ఈ విషయంలో రెండు రోజుల్లో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కలసి తదుపరి నిర్ణయం తీసుకోవడానికి రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం.



## టాటా మోటార్స్ వివిధ రాష్ట్ర రవాణా సంస్థల నుండి 5,000 కంటే ఎక్కువ బస్సుల దేశవ్యాప్త ఆర్డర్లను గెలుచుకుంది

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశ అతిపెద్ద వాణిజ్య వాహన తయారీదారు అయిన టాటా మోటార్స్, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్ర రవాణా సంస్థల నుండి ఇప్పటి వరకు 5,000 కంటే ఎక్కువ బస్సులు, బస్ ఛాసిస్ల సంచిత ఆర్డర్ల ను పొందింది. దేశవ్యాప్తంగా వచ్చిన ఈ ఆర్డర్లలో కంపెనీ గణనీయమైన వాటాను పొందింది. ఇది మాస్ మొబిలిటీ పరిష్కారాలలో భారతదేశం అత్యంత ఇష్టపడే భాగస్వామిగా తన స్థానాన్ని పునరుద్ఘాటించింది. ప్రతి టెండర్ను ప్ర భుత్వ సేకరణ వ్యవస్థ కింద పోటీ ఇబిడ్డింగ్ ప్రక్రియ ద్వారా పొందింది. సంబంధిత రాష్ట్ర రవాణా సంస్థలతో అంగీకరించిన విధంగా దశలవారీగా విస్తరణలు షెడ్యూల్ చేయబడ్డాయి.

## ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం శనివారం చల్లపల్లిలో ఘనంగా జరిగింది. తొలుత పడమరవీధిలోని పార్టీ కార్యాలయం వద్ద యువనేత మండలి వెంకట్రామ్ ము ఖ్య అతిథిగా పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనసైనికులు సంబరాలు చేశారు. ప్రధాన సెంటర్లో వెంకట్రామ్, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గలు కేక్ కట్చేసి పంచిపెట్టారు. సీయోను వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారాన్ని అందచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, సొసైటీ ఛైర్మన్ బొందలపాటి వీరబాబు, మండల జనసేన అధ్యక్ష కార్యదర్శులు చోడగం విమల్ కృష్ణ, తోట మురళీకృష్ణ, నేతలు పసుపులేటి రవికుమార్, మిరియాల జితేంద్ర, ప్రెస్ పూర్ణ, సూదాని నందగోపాల్, ఉరిమి మణికాంత్, బుల్లా కిషోర్, రంజిత్ కుమార్, రాజేంద్ర, రాము, చంద్రశేఖర్, వీరయ్య, నాంచారయ్య పాల్గొన్నారు. నడకుదురులో జనసైనికులు కొరసిక సాల్మన్రాజు, డొక్కు పృధ్వీరాజ్ ఆధ్వర్యంలో నూతనం గా నిర్మించిన జెండా దిమ్మను యువనేత మండలి వెంకట్రామ్ ప్రారంభించి జెండా ఎగురవేశారు.

## శివరాజును పరామర్శించిన ఎమ్మెల్యే కుమార్ రాజా



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని జువ్వనపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నీలపాల శివరాజు ఇటీవల అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటుండగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆయనను పరామర్శించారు. శివరాజు స్వగ్రహానికి వెళ్ళిన ఎమ్మెల్యే ఆయన పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి), పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## పత్రిక ప్రకటన

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చే విధ్యాధరపురం, రామరాజ్యనగర్ ప్రాంతంలో ఉన్న ఆస్తి సంబంధించి ఈ ప్రజా ప్రకటన జారీ చేయబడుతుంది. రెవెన్యూ వార్డు నెం.33లో గల పాత అసెస్‌మెంట్ నెం.475A, న్యూ అసెస్‌మెంట్ నెం.12180, అసెస్‌మెంట్ నెం.1073004970, న్యూ అసెస్‌మెంట్ నెం. 1073212773, డోర్ నెం. 3-2-51, 3-2-251Aలకు సంబంధించిన, సుమారు 123.41 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మితమైన ఆర్.సి.సి. డాబా ఇల్లు గల ఆస్తి యజమాని లేటు అంగ శంకర్ రావు భార్య అంగ అరుణ కుమారి నుండి పై పేర్కొన్న ఆస్తిని అంబాపురం గ్రామానికి చెందిన పైలా సత్యనారాయణ (మొబైల్: 9989355668) కొనుగోలు చేయుటకు సిద్ధమయ్యారు. పై ఆస్తిపై ఎవరికైనా హక్కులు, అభ్యంతరాలు లేదా వివాదాలు ఉన్నట్లయితే, ఈ ప్రకటన ప్రచురితమైన తేదీ నుండి 14 రోజుల లోపు తగిన ఆధారాలతో తెలియజేయగలరు. నిర్ణీత గడువులో ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే, పై ఆస్తిపై ఎవరికి ఎలాంటి అభ్యంతరాలు లేవని భావించి కొనుగోలు ప్రక్రియ కొనసాగించబడుతుంది.

అమ్మకందారు వివరాలు

**అంగ అరుణ కుమారి,**

మొబైల్ : 8985462184

# అంబరాన్ని అంటిన జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు

## జనసైనికులలో జోష్ నింపిన ఎంపీ బాలశౌరి, బండి రామకృష్ణ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ అవిర్భావ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, బండి రామ కృష్ణ జనసేన నాయకులు, జనసైనికులతో కలిసి బుల్లెట్ పై ప్రయాణించి నూతనోత్సాహన్ని నింపారు. రామానాయుడు పేట నుండి పాదయాత్ర గా కోనేరుసెంటర్ నుండి బస్టాండ్, లక్ష్మిటాకీస్ సెంటర్ మీదుగా పరాసుపేట సువర్ణకల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ సభకు భారీ ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా రామానాయుడు పేటలో ఏర్పాటు చేసిన జెండా దిమ్మెను ఎంపీ బాలశౌరి ఆవిష్కరించారు. జనసేన జెండాపై చెయ్యి వేసే దమ్ము ఎవ్వరికీ లేదు అని హెచ్చరించారు. జనసేన పార్టీ అంటే ఓ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని అటువంటి క్రమశిక్షణ కలిగిన పార్టీ జెండాపై ఎవరైనా చెయ్యి వేయాలని చూస్తే జనసైన్యం చూస్తూ ఊరుకోదు అని రాష్ట్రంలో ఎక్కడైనా జనసేన జెండా దిమ్మలు పెట్టే హక్కు మాకు ఉంది అని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటు చేస్తున్న మా పార్టీ జెండా దిమ్మను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు అని స్పష్టం చేసారు.ఒక నిబద్ధత నిజాయితీ కలిగిన విలువలతో కూడిన పార్టీ జనసేన పార్టీ.అని ఎంపీ తెలిపారు. అభివృద్ధికి ఆటంకపరిచే ఎటువంటి శక్తులమైన అధిగమించి ప్రజలకు సంక్షేమం అభివృద్ధి ఫలాలను అందించడమే జనసేన పార్టీ యొక్క సిద్ధాంతం అని వెల్లడించారు. పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ 12వసంతాలు పూర్తి చేసుకుని 13 వ సం. లోనికి ప్రవేశించిన సందర్భంగా పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియచేశారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్త కి అండగా జనసేన ఉంటుందని, పార్టీ కార్యకర్తల సంక్షేమమే ప్రధాన అజెండాగా ఉద్యమి నమో దు కార్య క్రమం విజయవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు. నిబద్ధత కూడిన రాజకీయ వారసులగా ప్రతి జనసైనికునికి పార్టీ బాధ్యతలు అప్పగించే విధానం జనసేన పార్టీలో కొనసాగుతోంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, మచిలీపట్నం జనసేన ఇంచార్జ్, కృష్ణాజిల్లా డీసీఎంఎస్ ఛైర్మెన్ బండి రామకృష్ణ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, డివిజన్ ఇంచార్జ్‌లు, పట్టణ, పంచాయితీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**పామర్రు మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఈ వేడుకలలో పాల్గొని స్థానిక విజయవాడ రోడ్ లో నూతనంగా నిర్మించిన పార్టీ స్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపి బాలశౌరి మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోనికి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు, భావజాలాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకుని పార్టీని బలోపేతం చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీ అభ్యర్థులు నూరు శాతం విజయం సాధించేలా కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. సభ్యత నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా సాధిక్‌లను ఆయన కోరారు. తొలుత విజయవాడ - మచిలీపట్నం ప్రధాన రహదారిపై భారీ ఎత్తున జనసైనికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల పార్టీ అధ్యక్షుడు గుంపా గంగాధరరావు, రాపర్ల ఎంపిటిసి సభ్యులు కూనపరెడ్డి సుబ్బారావు, పమిడిముక్కల మండల పార్టీ అధ్యక్షులు కృష్ణసుమన్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అంబటి రాజ్యలక్ష్మి, సహాయ కార్యదర్శి కాకి ఝాన్సీలతోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడడానికి అత్యంత కీలకపాత్ర జనసేనదే....





**నందిగామ, మేజర్ న్యూస్:** అటు కేంద్రంతో పాటు రాష్ట్రంలో కూడా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడటానికి జనసేన అత్యంత కీలకపాత్ర పోషించిందని నందిగామ జనసేన నాయకుడు పూజారి రాజేష్ అన్నారు.సామాన్య ప్రజలకు బలమైన అండగా ఉద్భవించిన జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను స్థానిక నందిగామ పాత బస్టాండ్ లో గల జనసేన పార్టీ కార్యాలయంలో జన సైనికులు వీర మహిళలు జెండాను ఎగరవేసి పార్టీ కార్యాలయం ఆవరణలో కేక్ ను కట్ చేసి కార్యకర్తలకు, వీర మహిళలకు అందించారు.జనసేన పార్టీ 13 వ వసంతంలోకి అడుగుపెట్టిన శుభసందర్భంగా పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్కి నందిగామ నియోజకవర్గ జనసైనికుల నుంచి వీర మహిళల నుంచి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి అన్ని తానై నిలిచి పార్టీని విజయబావుటా వైపు నడిపించి ఇటు రాష్ట్రంలో గాని అటు కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడడానికి అత్యంత కీలకపాత్ర పోషించారని ఆ పార్టీ నాయకుడు పూజారి రాజేష్ ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నందిగామ పట్టణ 20వ వార్డు కౌన్సిలర్ తాటి వెంకటకృష్ణ, నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులు పోలిశెట్టి వరుణ్,కామిశెట్టి వెంకటేశ్వరరావు, గుండాల బాలాజీ,నిమ్మల రాజశేఖర్, తాటి నరేంద్ర కుమార్, షేక్ అజారుద్దీన్, సింగంశెట్టి శ్రీనివాస్, తోట ఓంకార్, వేణుగోపాల్,జాబు శెట్టి మధుసూదన్, సతీష్, నరసింహ, నాని, నరేష్, ప్రసాద్, గోపి, రాఘవ సుధాకర్, కోటేశ్వరరావు, రవీంద్ర, మధు, వీర మహిళలు పాములపాటి వెంకట తులసి, మేకపోతుల శ్రీ లక్ష్మీ యాదవ్, ఆవుల పార్వతి,రమణ, పలువురు జన సైనికులు, మహిళలు హాజరైనారు.

## కోడూరులో జనసేన ఆవిర్భావ వేడుకలు



**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరులో జనసేన 13వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు మండల జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జనసేన పథకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జనసేన పార్టీ ఆశయాలను గూర్చి, మండల పరిధిలో చేసిన అభివృద్ధిని గూర్చి కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మర్రే గంగయ్య స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రయత్నాలను తిప్పికొట్టాలి

### అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



**మోపిదేవి మేజర్ న్యూస్:** కూటమిని విచ్ఛిన్నం చేయాలనే ఉద్దేశ్యంతో కులాల పేరుతో వైసీపీ చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ జనసేన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. శనివారం స్థానిక ప్రధాన కూడలిలో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పార్టీ జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి కలిసి ఉంటే, తమకు మళ్ళీ అధికారం దక్కదని తెలిసిన వైసీపీ నాయకులు కూటమిలో చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని కోరారు. మరోమారు నాటి దుర్మార్గ పరిపాలన రాష్ట్రంలో రాకుండా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు పవన్ కళ్యాణ్ అనేక త్యాగాలు చేశారన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ పూషడపు రత్నగోపాల్, పెద్దకళ్లేపల్లి సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యులు అరజా ఆశాదేవి, సనకా వెంకట రాజేష్ బాబు, పీఏసీఎస్ చైర్మన్లు అరజా రాధిక, కోసూరు నాగమల్లేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ మెరకనపల్లి నరేష్, టీసీ అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నందిగామలో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**నందిగామ, మేజర్ న్యూస్ :** నందిగామలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకకు జన సైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నందిగామ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి ఆధ్వర్యంలో నందిగామలో శనివారం ఉదయం జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లి రమాదేవి మాట్లాడుతూ జ నసేన పార్టీ నాయకులకు, జనసైనికులకు,వీరమహిళలకు జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యమి సభ్యత్వ నమోదును గ్రామస్థాయిలో వేగవంతం చేయాలనీ సాధక్‌లకు పిలుపునిచ్చారు.

## ఎన్జీవో నేత విద్యాసాగర్ పుట్టినరోజు వేడుకలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ పుట్టినరోజు వేడుకలు శనివారం చల్లపల్లి యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్చేసి పం చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై నిరంతరం శ్రమించే ఉద్యోగుల ఆశాజ్యోతి విద్యాసాగర్ ఒక్కరే రాష్ట్రంలో ఏకైక నాయకులని నేతలు తెలిపారు. కార్యక్రమంలో చల్లపల్లి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు పేర్ని మాధవేంద్రరావు, చల్లపల్లి దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఘంటసాల కృ ష్ణమోహన్, యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సుధాకరరావు, పెనుమూడి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, బాబూరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలు ఈ సంవత్సరం నుండే...

**నందిగామ విద్యా విప్లవంలో చారిత్రాత్మక ముందడుగు**

**తరగతుల ప్రారంభోత్సవానికి అధికారిక ఉత్తర్వులు....**

**ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**నందిగామ,మేజర్ న్యూస్ :** నందిగామ కేంద్రీయ విద్యాలయంలో ఈ సంవత్సరం నుండే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించబోతున్నట్లు ప్రభుత్వ విప్ నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామ కాకాని నగర్‌లోని తంగిరాల సౌమ్య కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గ చరిత్రలో నేడు మరో సువర్ణాధ్యాయం రచించబడిందని, సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, నందిగామ కేంద్రీయ విద్యాలయానికి కేంద్రీయ విద్యాలయ సంఘటన్ నుండి ఉత్తర్వులు అందాయని ఆమె తెలియజేశారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం నుండే ఈ విద్యాలయం అందుబాటులోకి రానుంది. ఇది నందిగామ విద్యారంగ చరిత్రలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యే వరకు విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకూడదనే దూరదృష్టితో, తాత్కాలిక భవనంలో 1 నుండి 5వ తరగతి వరకు తరగతులు ప్రారంభించడానికి అనుమతి సాధించడం జరిగిందనీ, ఒకవైపు తరగతులు ప్రారంభమవుతుండగా, మరోవైపు రాఘవాపురంలోని 5 ఎకరాల సువిశాల స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందనీ, భవన నిర్మాణ ప్రణాళికలుమరియు డిజైన్ల కోసం కేంద్రం నుండి ఇప్పటికే రూ. 20 లక్షల నిధులు మంజూరు అయ్యాయనీ ఆమె తెలియజేశారు. ఈ అత్యాధునిక విద్యా సౌధ నిర్మాణ బాధ్యతలను యూపీ జల్ నిగం సంస్థకు అప్పగించడం జరిగిందనీ ప్రకటించారు. గత పాలకుల వైఫల్యాలను తీవ్రంగా ఎండగట్టారు. గత ఐదేళ్లలో కేంద్రీయ విద్యాలయం పేరుతో నందిగామ ప్రజలను కేవలం కాగితాలపై కబుర్లతో వంచించారు తప్ప, క్షేత్రస్థాయిలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ఒక్క ఇటుక పెట్టి నిర్మాణం చేయలేదు సరే కదా, కనీసం ఒక్క సెంటు స్థలం కూడా సొంతంగా సేకరించలేదు. ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయించలేదు. గత తెలుగుదేశం హయాంలో నిర్మించిన పాత పాలిటెక్నిక్ కాలేజీ భవనానికి రంగులు వేసి, అదేదో తాము నిర్మించినట్లు భ్రమ కల్పించారు. హనుమంతుపాలెంలో జి ప్లస్ త్రీ నిర్మాణాల కోసం గతంలో సేకరించిన స్థలాన్ని కేటాయించి, దాన్ని మెరక చేస్తున్నామనే నెపంతో లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని దండుకోవడానికే వారు ప్రాధాన్యత ఇచ్చారు. క్లాసులు ప్రారంభించడానికి కేంద్రంలో అనుమతి సాధించే ప్రయత్నాలు మాత్రం చాలా స్వల్పంగా జరిగాయి.

ప్రజలు ఈ మోసాన్ని గుర్తించి తగిన బుద్ధి చెప్పినా, నేటికీ ఈ విద్యాసంస్థపై 'క్రెడిట్ చోరీ'కి ప్రయత్నించడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని ఆమె అన్నారు. గత పాలకులవి రంగులు వేసి బిల్లులు దండుకునే ఆలోచనలు అయితే, మావి పునాదులు వేసి పాఠాలు చెప్పించే ఆచరణాత్మక చర్యలు. మాటలు చెప్పే నాయకత్వం కాదు.. పనులు చేసి చూపించే ప్రభుత్వమిదనీ ఈ విజయ సాధనలో అవిశ్రాంతంగా శ్రమించి కీలక పాత్ర పోషించిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కలలను కళాకారులను కాపాడుకోవాలి

**మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తెలుగు వారి సంప్రదాయ కళలను కళాకారులని కాపాడుకోవాలని మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. స్థానిక ప్రధాన పార్కు ఓపెన్ ఆడిటోరియంలో దుర్గా కళామందలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కళా వైభవాలు కార్యక్రమం జరిగింది. ప్రముఖ రంగ స్థల నటి మల్లేశ్వరి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కళలను కాపాడుకున్నప్పుడే సమాజం కళకళలాడుతుందనీ వ్యాఖ్యానించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ సమాజ చైతన్యంలో కళలు ప్రధాన పాత్ర వహిస్తాయని అన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు మాట్లాడుతూ మన దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పేవి కళలే అన్నారు. ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ దుర్గా కళామందలి అధ్యక్షుడు గాంధీ పెద్ద వయసు వచ్చి ఓపిక లేకపోయినా కళారంగ కార్యక్రమాలు నిర్వహించటం అంటే కళ పట్ల ఆయనకున్న అంకిత భావాన్ని నిరూపిస్తోందని అభినందించారు. భావ తరంగిణి అధ్యక్షులు భవిష్య అధ్యక్షతన జరిగిన సభలో రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వేముల సూరిబాబు, కళా మండలి అధ్యక్షులు గాంధీ పాల్గొన్నారు. సభానంతరం నాట్యాచార్య ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలు ఆకట్టుకున్నాయి. తదుపరి మడమల రాంబాబు హరికథ గానం జరిగింది.

## 23న క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ప్రారంభం

**టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈనెల 23వ తేదీన నగరంలోని కమ్మవారి కళ్యాణ మండపంలో బసవతారకం హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, టిడిపి సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపి చంద్ అన్నారు. ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరము విధివిధానాలు తెలియజేసే కరపత్రాలను శనివారం కమ్మవారి సంక్షేమ సంఘంలో గొర్రెపాటి గోపీచంద్, వేమూరి బాలరత్నం, కోటేశ్వరరావు, డివిజన్ ఇన్చార్జ్, బత్తిన దాసు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, ఫణి కుమార్, చింతా శ్రీనివాసరావు, మందయ్య, కోటేశ్వరరావులు ఆవిష్కరించారు. గోపీచంద్ మాట్లాడుతూ బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ వారు ఈనెల 23వ తేదీ సోమవారం నిర్వహించే ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరమును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరంలో బసవతారకం హాస్పటల్ వారు 200 మందిని పరీక్షించడం జరుగుతుందని కావున ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని డివిజన్ ఇంచార్జ్ బత్తిన దాసు కోరారు. పేర్లు నమోదు చేసుకునేవారు 9440848931, 9441214575, 9908945656 నెంబర్లకు కాల్ చేయాలన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వారి సౌజన్యంతో క్యాన్సర్ నిర్ధారణకై ప్రజల కోసం ఉచిత శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## ఇంటి పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని అధిగమించాలి



**మొవ్వ మేజర్ న్యూస్:** మండలంలో ఈనెల 14వతేది నుంచి 20 వ తారీకు లోపుగా ఇంటి పన్ను బకాయిలు వసూలు చేసి లక్ష్యాన్ని అధికమించాలని గుడివాడ డి ఎల్ పి ఓ కార్యాలయ పరిపాలన అధికారి పి.శివరామకృష్ణ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సిబ్బందికి సూచించారు. శనివారం ఇంటి పన్ను వసూలు కావలసిన గ్రామపంచాయతీ కార్యదర్శులతో కూచిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలోసమావేశం నిర్వహించి జిల్లా అధికారుల సూచనల మేరకు కేటాయించిన లక్ష్యాన్ని వసూలు చేయాలని స్పష్టం చేశారు. మండలంలో ఇంటి పన్ను, నాన్ టాక్స్ కలిపి రూ. 1,24,97,925 లు వసూలు కావాల్సి ఉందని పేర్కొన్నారు. దీనికోసం ప్రతిరోజు వసూలు చేయాల్సిన పన్నులపై దృష్టి సారించాలని ఆదేశించారు. నాన్ టాక్సెస్ ద్వారా రూ. 8,41,177లు టాక్సెస్ ద్వారా రూ.17,85,418లు వసూలు చేయాలని వెల్లడించారు. ఈ దశలో కూచిపూడిలో వసూలు చేయాల్సిన బకాయిలను కార్యదర్శి కేపీవి.అంకబాబుతో కలిసి తిరిగి వసూలు చేశారు. ఈ సమావేశంలో మండలంలోని పలు మైనర్ గ్రామపంచాయతీ కార్యదర్శులతో పాటు మేజర్ పంచాయతీ కార్యదర్శులు వీర హనుమాన్ గౌడ్(మంత్రి పాలెం, అయ్యంకి), నిషాక్ అలీ(నిడుమోలు), అంకబాబు (కూచిపూడి) పాల్గొన్నారు.

## క్రీడలు విద్యార్థులను జీవిత సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం చేస్తాయి : అమరనేనిమనోజ్



**నందిగామ, మేజర్ న్యూస్ :** పొన్నవరం గ్రామంలో ఏకత్వా సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన ఉప్పులూరి రామ్ తేజ్, బాణా వత్తు చైతన్య, వడ్లమూడి పూ జిత జాతీయ స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ బాల, బాలికల పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల వ్యాయమ విద్యా విభాగాధిపతి విజయ్ కుమార్ గోగులమూడి తెలిపారు. ఇటీవల పల్నా డు జిల్లాలోని సత్తెనపల్లిలో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటి వీరు ఈ అవకాశం దక్కించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఏకత్వా పాఠశాల డైరెక్టర్లు అమరనేని మనోజ్, సింధుర శనివారం క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువు ముఖ్యమైనదే అయినప్పటికీ, క్రీడలు పిల్లల సమగ్ర అభివృద్ధి, పెరుగుదలకు సహాయపడతాయన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం క్రీడలు ఆడటం వల్ల వారికి జట్టుకృషి, నాయకత్వం, జవాబుదారీతనం, ఓర్పు, ఆత్మవిశ్వాసం వంటి జీవిత నైపుణ్యాలను నేర్పుతుంది, జీవిత సవాళ్లను ఎదుర్కొనేందుకు వారిని సిద్ధం చేస్తుందనీ అన్నారు.

## పది విద్యార్థులకు పరీక్షల ప్యాడ్స్, స్టేషనరీ పంపిణీ



**చల్లపల్లి, మేజర్ న్యూస్:** సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా చల్లపల్లి జడ్పీహైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు 67 మందికి పరీక్షల ప్యాడ్స్, స్టేషనరీలను చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి వితరణగా అందచేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్ ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థులకు పం పిణీ చేశారు. పదవ తరగతి పరీక్షలు శ్రద్ధగా రాసి మంచిమార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, కోఆప్షన్ సభ్యుడు షేక్ నబీఖోరి, మోర్ల శివ, రావి రాజు, గంగిశెట్టి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడి, ఆందోళన లేకుండా ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

**తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కానూరు పంచాయతీ వన్నారు కానూరు గ్రామంలో ఉన్నత పాఠశాలలో కృష్ణజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పదవ తరగతి వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థిని విద్యార్థులందరికీ ఎగ్జామ్ కిట్ ను అందచేశారు. వారికి శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి ఒత్తిడి, ఆందోళన లేకుండా ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి. మీరు చదివిన అంశాలను గుర్తుచేసుకుంటూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోండి. మీ కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది, అత్యుత్తమ ఫలితాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని చెప్పారు. మన హైస్కూల్



లో పదవ తరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థులకు ప్యాడ్, పెన్స్, పెన్సిల్, జమ్మెటరీ కిట్‌ను అందచేశారు, ఎగ్జామ్ కిట్ ను అందుకున విద్యార్థి, విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు, ఇలాంటి నాయకులు మన గ్రామంలో చేస్తున్న ఇటువంటి మంచి కార్యక్రమాలు మనం ఉపయోగించుకొని మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని, విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాసి, మంచి ఫలితాలను సాధించాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. మన హైస్కూల్ లో పదవ తరగతి పరీక్షల్లో 551 మార్కులు కలిగి ఉత్తీర్ణ పొందిన వారికి 10000/రు బహుమతి అందజేస్తానని చెప్పారు.తదుపరి స్కూల్ హెచ్ఎం మాట్లాడుతూ మన గ్రామం లో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులు తెచ్చి మన స్కూల్ కి మంచి పేరు తేవాలని కోరారు, ఈ కార్యక్రమంలో బొలిశెట్టి నాని, ఈవన యేసు, స్కూల్ ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.



## అభివృద్ధికి దాతలు ముందుకు రావడం హర్షణీయం

**పామర్రు మేజర్ న్యూస్ :** రాష్ట్ర అభివృద్ధిలో దాతలు భాగస్వామ్యం కావడం అభినందనీయమని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రు టౌన్‌లో ఎన్టీఆర్ సర్కిల్ సుందరీకరణ పనులు, ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధిపరిచేందుకు, అలాగే సెంటర్లో ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి దాతలు ముందుకు రావడం పట్ల ఆయన హర్షం చేశారు. ఇందుకు సంబంధించి దాతలతో కలిసి ఎమ్మెల్యే కుమార్ రాజా నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ ను, అలాగే పుల్లేరు కాలువ వంతెన ప్రక్కన మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని, ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. కెఎంవి ప్రాజెక్ట్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకు రావడం ఎంతో ఆనందదాయకమన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోరిక మేరకు త్వరలోనే ఈ పనులను ప్రారంభించి స్థానిక ప్రజలకు సౌకర్యాలను అందిస్తామని ఈ సందర్భంగా కెఎంవి ప్రాజెక్టు డైరెక్టర్ ఘంటా శ్రీహర్ష తెలిపారు. గ్రామాల అభివృద్ధికి, స్థానిక అవసరాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్నానని, ప్రైవేటు సంస్థల సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చిన శ్రీహర్షను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమాలు పామర్రు నియోజకవర్గ ప్రగతికి మైలు రాయిగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పార్టీ సీనియర్ నాయకుడు ఘంటా సురేష్, మండల పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, పామర్రు టౌన్ పార్టీ కార్యదర్శి మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సిడిసి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన



**రెడ్డిగూడెం, మేజర్ న్యూస్ :** రెడ్డిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ప్రధాన మంత్రి పంట బీమా పథకం, వాతావరణ ఆధారిత పంట బీమా పథకం,, కిసాన్ క్రెడిట్ కార్డు, పథకాల గురించి రైతులకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఎన్సిడిసి రీజనల్ డైరెక్టర్ ఎస్. గోస్వామి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా పంట బీమా పథకాలు, రైతు రుణ సౌకర్యాలు, వాతావరణ ఆధారిత పంట బీమా ద్వారా రైతులు ఆర్థిక భద్రత పొందవచ్చని తెలిపారు. పిఎసిఎస్ అధ్యక్షులు ఉయ్యూరు సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి అని కోరారు. ఈ సమావేశంలో రెడ్డిగూడెం పిఎసిఎస్ అధ్యక్షులు అధ్యక్షులు ఉయ్యూరు సుబ్బారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, పార్టీ యువ నాయకులు బొమ్మిన కోటేశ్వర రావు, రంగాపురం గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుప్పిరెడ్డి అశోక్ రెడ్డి, రెడ్డిగూడెం తెలుగుదేశం సెక్రెటరీ తోర్లపాటి సోమేశ్వరరావు, రెడ్డిగూడెం గ్రామ పంచాయితీ వైస్ ప్రెసిడెంట్ కొండపల్లి బాబు, రైతులు, స్థానిక నాయకులు, పిఎసిఎస్ సిబ్బంది, ప్రతినిధులు పాల్గొన్నారు. రైతులు తమ సందేహాలను అడిగి అధికారుల నుండి సమాధానాలు పొందారు.

## ఆలయ చైర్మన్ నరసింహారావును పరామర్శ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** కోడూరు మండలం విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ దేవస్థానం చైర్మన్ తోట సూర్య వెంకట నరసింహారావుపై శుక్రవారం జరిగిన దాడి ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ దాడిలో గాయపడి అవనిగడ్డ ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న చైర్మన్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, అవనిగడ్డ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు.దాడి జరిగిన తీరును, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని కనపర్తి శ్రీనివాసరావు అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పరామర్శలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లూరి బసవేశ్వర రావు,టీడీపీ నేతలు మండలి రామమోహనరావు, దుర్గాప్రసాద్, భాస్కర్ రావు,రేపల్లె ప్రతాప్, విజయ్, వాసు పాల్గొన్నారు.

# పాత ఇనుము ఆక్రమణల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం

### కాలనీవాసులు, ఉద్యోగుల ఇక్కట్లు.....

### త్వరలో తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి వివరణ






**పామర్రు మేజర్ న్యూస్ :** అధికారుల నిర్లక్ష్యం ఒకవైపు పాత ఇనుము వ్యాపారి స్వలాభం మరోవైపు వెరసి ప్రభుత్వ ఉద్యోగులు, కాలనీవాసులు ఇక్కట్లకు గురవుతున్నారు. కాలనీవాసులు తామపడుతున్న ఇబ్బందులను ఎన్ని మార్లు అధికారులు దృష్టికి తీసుకు వెళ్లిన పట్టించుకోవడంలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే పామర్రు కార్పెంటర్ కాలనీకి వెళ్లే రహదారి పాత ఇనుము వ్యాపారి ఆక్రమణలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిలోనే గృహ నిర్మాణ శాఖ కార్యాలయం, వెలుగు కార్యాలయం, మండల మహిళా సమాఖ్య కార్యాలయం లతోపాటు ఐటిఐ కళాశాల, కార్పెంటర్ కాలనీ ఉంది. పామర్రు నుండి మచిలీపట్నం వెళ్ళు ప్రధాన రహదారి నుండి కార్పెంటర్ కాలనీకి వెళ్లే రోడ్డులో సుమారు 100 అడుగుల దూరంలో పాత ఇనుము వ్యాపారానికి సంబంధించిన నిల్వలు ఉంటున్నాయి. రహదారిలో ఒకవైపు భవనాలు మరోవైపు కాలువ ఉండగా రోడ్డుకు రెండువైపులా పాత ఇనుము సామాన్లను గుట్టలుగా నిలువచేసి వాహ నదారులు, పాదచారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. పలుమార్లు తాము ఇబ్బంది పడుతున్నామని ఉద్యోగులు, ఇటు కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీస స్పందనలేదని వారు వాపోతున్నారు. రెండు రోజుల క్రితం పాత సామాన్లలో ఉన్న ఆక్సిజన్ సిలిండర్ పేలి ఈ రోడ్‌లో సైకిల్ పై వెళుతున్న వృద్ధుడు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ సంఘటన జరిగి మూడు రోజులు గడిచినా నేటి వరకు అధికారులు అటువైపు కనీసం కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అంతేకాక గతంలో పంచాయతీ కార్యాలయం కూడా ఈ రోడ్‌లోనే ఉండగా ప్రస్తుతం ఆ భవనం ముందు కూడా ఇనప సామాగ్రితో నింపినా అధికారులకు పట్టడం లేదు. వెలుగు కార్యాలయానికి, మహిళా సమాఖ్య కార్యాలయానికి వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో ఈ రోడ్‌లో రావాల్సి ఉంటోందని మహిళలతోపాటు ఆయా కార్యాలయాల సిబ్బంది, ఐటిఐ కళాశాల విద్యా ర్థులు, కార్పెంటర్ కాలనీవాసులు పేర్కొంటున్నారు. కాగా ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం ను వివరణ కోరగా ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. త్వరలో ఆక్రమణ లేకుండా చూస్తామని చెప్పారు.

## సనాతన ధర్మ ప్రచారానికి గ్రామస్థాయిలో కృషి చేయాలి



**హనుమాన్ జంక్షన్, మార్చి 14, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామం వెలమపేటలోని శ్రీ కోదండ రామాలయంలో శివశక్తి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివశక్తి ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు (రామసేతు కార్యకర్త) మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ ధార్మిక సమితి ద్వారా ప్రతి నెల దేవాలయం కేంద్రంగా సత్సంగాలు నిర్వహించడం, శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాభ్యాసాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామ అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణ కోసం పలు కార్యక్రమాలు చేపట్టాలని, ఆరు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే సంవత్సరానికి ఒకసారి విశిష్ట ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. చిన్నపిల్లలకు భగవద్గీత, రామాయణం బోధించడం, యువతీ యువకులకు కుట్టుమిషన్, కంప్యూటర్ వంటి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలను ఉచితంగా అందించాలని అన్నారు. గ్రామస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని, గ్రామస్తులు చేసే ప్రతి కార్యక్రమానికి శివశక్తి సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సత్యనారాయణ చార్యులు, శివశక్తి సభ్యులు వాకాటి ప్రతాప్, సరిత, మద్రపు శివలీల, ఉమా, వెంకటేశ్వరరావు, వంట మేస్త్రి శివ తదితరులు పాల్గొన్నారు.

# పేదల కష్టాన్ని చూసి చలించే నేత పవన్ కళ్యాణ్

### ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : పేదల కష్టాన్ని చూసి చలించే నేత పవన్ కళ్యాణ్ అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు సెంటర్లో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టౌన్ అధ్యక్షులు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రతిఏటా రాయపూడి వేణుగోపాల్ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి పానకం పంచిపెట్టారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం గురించి పరితపించే నేత పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రధాని మోదీ చెప్పినట్లు పవన్ కళ్యాణ్ అనే తుఫానులో వైసీపీ కొట్టుకుపోయిందన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేసిన రోజు వైసీపీ సృష్టించిన అనేక అవరోధాలు ఎదుర్కొని చంద్రబాబుకు బాసటగా నిలిచి బిజెపిని కలుపుకొని కూటమి ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ధీరోదాత్త నేత పవన్ కళ్యాణ్ అని తెలిపారు. జనసేనకు బలమైన ఓట్ బ్యాంక్ ఉందన్నారు. ఎవరినైనా గెలిపించగల శక్తి, ఓడించగల శక్తి జనసేనకు ఉందని గుర్తించి వ్యవహరించాలని స్పష్టం చేశారు. కూటమిలో అనైక్యత తెచ్చేందుకు కొంతమంది చేసే రెచ్చగొట్టే ప్రయత్నాలపై ప్రతిస్పందించవద్దని సూచించారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా శ్రేణులు సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశానికి అనుగుణంగా 15 ఏళ్లు కలిసి ఉండాలనే ఆకాంక్ష నిలబెట్టుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. మహాత్మా గాంధీ ఆకాంక్షించిన గ్రామ స్వరాజ్యాన్ని ఆచరించి చూపిన నాయకుడు పవన్ కళ్యాణ్ అని తెలిపారు. వైసిపి పరిపాలనలో అధ్వాన స్థితికి చేరుకున్న రహదారులను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో విస్తృత సంఖ్యలో జరుగుతున్న తారు రోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణం గురించి జన సైనికులు గర్వంగా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని రోడ్లు అభివృద్ధి చేసే సంకల్పంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, చెన్నగిరి సత్యనారాయణ, బాదర్ల లోలాక్షుడు, గుడివాక శివరావు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, కటికల వసంత్, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, జిల్లా కర్రసాము అసోసియేషన్ చైర్మన్ సింహాద్రి పవన్, పార్టీ మండల ఉపాధ్యక్షులు తుంగల నరేష్, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బారావు, దేవస్థానం డైరెక్టర్లు కోసూరు అవినాష్, మత్తి శివపార్వతి, నాయకులు కమతం నరేష్, యాసం శ్రీరాములు, కమ్మిలి సాయిభార్గవ, ఆళ్లమల్ల చందుబాబు, మాదివాడ రాము, భోగాది శ్రీలక్ష్మి, గుగ్గిలం అనీల్-గాయత్రి, అన్నపరెడ్డి రామదాస్, అన్నపరెడ్డి ఏసు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షల ఇన్విజిలేటర్లుగా ప్రైవేట్ టీచర్లు

## విద్యాశాఖ చారిత్రాత్మక నిర్ణయం



**హనుమాన్ జంక్షన్, మార్చి 14 (మేజర్ న్యూస్):** రాష్ట్రంలో ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కూడా ఇన్విజిలేటర్లుగా నియమిస్తూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ప్రైవేట్ స్కూల్ టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గానీ, ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత గానీ ఇప్పటివరకు ప్రైవేట్ ఉపాధ్యాయులను పదో తరగతి పరీక్షల ఇన్విజిలేటర్లుగా నియమించలేదు. అయితే ఈ ఏడాది నుంచి మొత్తం ఇన్విజిలేటర్లలో 21 శాతం మంది ప్రైవేట్ స్కూల్ టీచర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హతలు, సామర్థ్యాలు ఉన్న తమకు ఇది ఒక సంతోషకరమైన అవకాశమని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అదేవిధంగా, పరీక్షా పత్రాలను సక్రమంగా దిద్దని ఉపాధ్యాయులపై ఈ సంవత్సరం నుంచి కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు ప్రకటించడం పట్ల కూడా సర్వత్రా సానుకూలత వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా బాపులపాడు మండల ప్రైవేట్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ మండల కార్యదర్శి మలిశెట్టి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రైవేట్ స్కూల్ టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో పదో తరగతి పేపర్లు దిద్దే ప్రక్రియలో (స్పాట్ వాల్యుయేషన్) కూడా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రైవేట్ స్కూల్ టీచర్ల తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కూటమి ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు పెద్దపీట



**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) అన్నారు. అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొని ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని కుమ్మరిపాలెం సెంటర్‌లో ప్రజా దర్బార్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నలు పాల్గొని ప్రజల నుంచి సమస్యలతో కూడిన వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమం అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అధికారులతో కలిపి ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు ప్రభుత్వం తెలుసుకుంటుందన్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వపరంగా చర్యలు చేపడుతున్నామన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందాలి, ఇళ్ల స్థలాలు అందాలి, ప్రభుత్వ పథకాలు అందాలి ఇదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం అని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలుచేసి చూపించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న మాట్లాడుతూ.... ప్రస్తుతం కుమ్మరిపాలెం సెంటర్లో 12వ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు తెలిపిన సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేలా కేశినేని చిన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొట్టేటి హనుమంతరావు, సీనియర్ నాయకులు కామా దేవరాజు మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్ల, ఏపీ నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ సుఖాసి కిరణ్, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ, క్లస్టర్ ఇంచార్జి భవానీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి ఈశ్వర్, కొల్లి శారద, పితాని పద్మ,తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి పితాని పద్మ, జిల్లా నాయకులు స్రవంతి, చింతపల్లి సత్యనారాయణ, షేక్ బాషా, షేక్ రంజాని, కంభంపాటి దుర్గారావు పాల్గొన్నారు.

## భవానిపురంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ



**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** అల్లాహ్ దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని ) అన్నారు. పశ్చిమలోని 42,43 డివిజన్లకు చెందిన మైనారిటీ కమిటీల ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాల వారికి రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం శనివారం భవానీపురంలోని నగరపాలక సంస్థ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ ముందుగా పేద ముస్లిం కుటుంబాల వారికి రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ అల్లాహు కృప కోసం ప్రార్థనలు చేస్తారన్నారు. ప్రతి ముస్లిం రంజాన్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. రంజాన్ మాసంలో వేద ముస్లిం కుటుంబాల వారికి చేయూతనిచ్చేలా రంజాన్ కిట్లను పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన మైనారిటీ నాయకులు ఆలీ, నజీబ్ మిత్ర బృందాన్ని ఎంపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, క్లస్టర్ ఇంచార్జి, మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, మార్కెట్ యార్డ్ కమిటీ ఉపాధ్యక్షులు పాల మాధవ, ఆయా డివిజన్ల టిడిపి అధ్యక్షులు పత్తి నాగేశ్వర రావు, రాంబాబు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష, టిడిపి మైనార్టీ సెల్ నాయకులు షాబుద్దీన్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# వేసవికాలంలో ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందాలి



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** సెంట్రల్‌లోని 27వ డివిజన్ దుర్గాపురం ప్రాంతంలో కార్పొరేటర్ వీరమాచినేని లలితా కిషోర్ ఆధ్వర్యంలో వేసవికాలంలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం అక్కడికి వచ్చిన పాదచారులకు మజ్జిగ పంపిణీ చేసి వేసవి కాలంలో ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ముఖ్యంగా నగరంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. వేసవి కాలంలో ప్రజలు ఎండ వేడిమితో ఇబ్బంది పడకుండా ఉండేందుకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడైతే అధికారంలోకి వస్తుందో అప్పుడల్లా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని ప్రతి కూడలి, ప్రతి డివిజన్‌లో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బయట ఒక వాటర్ బాటిల్ కొనాలంటే రూ.15 నుండి రూ.20 వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని, అలాంటి పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్పొరేషన్ సహకారంతో నగరంలోని అనేక కేంద్రాలలో ఉచితంగా చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రత్యేకంగా అసంఘటిత కార్మికులు, ముఠా వర్కర్లు, ఆటో డ్రైవర్లు, రోడ్లపై పనిచేసే కార్మికులకు ఈ చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా కూడా నగరంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించామని, ఇదే విధంగా ఈ సంవత్సరం కూడా అనేక ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా పార్టీ నాయకులు, కార్పొరేటర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తమ తమ డివిజన్‌లలో ప్రజలకు మజ్జిగ, చల్లటి తాగునీరు అందిస్తున్నారని చెప్పారు. అత్యవసర పరిస్థితులు తప్పితే ప్రజలు ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలను ఎండ బారి నుండి కాపాడేందుకు పార్టీ తరఫున, ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు కొనసాగిస్తామని బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో 27,28 డివిజన్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణుల దాడి హేయం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** నాగాయలంక మండలం చోడవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు జరిపిన దాడిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగాయలంక మండలం చోడవరం గ్రామానికి చెందిన బాధితులను ఆయన పరామర్శించారు. బుధవారం చోడవరంలో వైసీపీ నేతలు దాసరి ప్రకాష్, దాసరి మురళి, లింగం సుధీర్‌లు కలిసి టీడీపీ కార్యకర్తలు కర్రా బుజ్జి, కర్రా శ్రీనివాసరావులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడటం వారు తీవ్రంగా గాయపడ్డారు.ఈ దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను కనపర్తి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు.గాయపడిన కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, ఇలాంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాధితులకు సంఘీభావం ప్రకటించారు.

## నాగాయలంకలో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన నాగాయలంక లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించి పార్టీ జెండా ఆవిష్కరించారు. శనివారం జనసేన మండల పార్టీ నాయకులు బండ్రెడ్డి హరి ఆధ్వర్యంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ విచ్చేసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, వక్కపట్లవారిపాలెం సర్పంచ్ అంబటి శ్యామ్ ప్రసాద్, నాచుగుంట సర్పంచ్ నాగబాబు, బరంకుల బ్యాంక్ అధ్యక్షులు శ్రీనివాసరావు, భోగాది శివ విష్ణు, ఉపాధ్యక్షులు బొడ్డు విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

## ఘనంగా గరికపాటి శ్రీనివాసరావు 18వ వర్ధంతి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** వేకనూరు మాజీ సర్పంచ్ గరికిపాటి శ్రీనివాసరావు 18వ వర్ధంతి కార్యక్రమాన్ని అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ వేకనూరు వంతెన సెంటర్ లోని గరిగిపాటి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అక్షయ డెవలపర్స్ అధినేత జనసేన నాయకులు మాదివాడ వెంకట కృష్ణ, (క్రిస్టియన్,) కోడూరు మాజీ జడ్పిటిసి బండే శ్రీనివాసరావు, లంకమ్మ గుడి చైర్మన్ అన్నపురెడ్డి వెంకటస్వామి, గాజుల మురళి కృష్ణ (భుట్టో), మత్తి శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది మాదివాడ వెంకటకృష్ణారావు, బండే రాఘవ,, వేకనూరు మాజి సర్పంచ్ నిజాంపట్నం హరిబాబు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ సంతోషంగా జరుపుకోవాలి



**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** పశ్చిమ నియోజకవర్గం 48వ డివిజన్లోని చిట్టినగర్ ఈద్గా ప్రాంగణంలో అమ్మ సేవ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆర్ మాధవ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పేద ముస్లిం కుటుంబాల వారికి రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ రంజాన్ తోఫా కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాద్ మాట్లాడుతూ... ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండి ఫతవుల్లా, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పి.మాధవ 48వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు జోగేష్, డైరెక్టర్ రాము, షాదీ ఖానా కార్యదర్శి అక్బర్ ఖాన్, నాయకులు పటాన్ రషీద్ ఖాన్, పఠాన్ అక్బర్ ఖాన్,షేక్ కాజా, షేక్ సుభాని, షేక్ నూర్మి, పిళ్ళా వంశీతారక్,తమ్మిన నరేష్, గిరీష్, నాగోతి వెంకటేష్, కంభంపాటి నాగేంద్రబాబు, కె.అశోక్, కె ప్రదీప్, వినకొండ చంటి, దాసరి నాగమణి, జు వెంకటరమణమ్మ, వాణి, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లీం కుటుంబాలకు రంజాన్ తోఫా

### తన సొంత నిధులతో 1000 కుటుంబాలకు అందజేసిన ఎమ్మెల్యే బొండా



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** 64వ డివిజన్ కండ్రిక మజీది హబీబీ వెనకవైపు ఉన్న గ్రౌండ్లో డివిజన్‌లోని 1000 మైనారిటీ కుటుంబాలకు ప్రభుత్వ విప్ సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వర రావు పవిత్ర రంజాన్ సందర్భంగా శనివారం రంజాన్ తోఫా అందించారు. ఈ సందర్భంగా బోండా ఉమా మాట్లాడుతూ 64వ డివిజన్‌లో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించి సుమారు 1000 మైనార్టీ కుటుంబాలకు రంజాన్ తోఫాను అందజేయడం ఆనందంగా ఉందని, నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, రాబోయే ఆరు రోజుల్లో ప్రతిరోజు రెండు డివిజన్లలో రంజాన్ తోఫాను పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించి మైనార్టీ సోదరులకు సహాయం అందజేస్తామని, మైనార్టీ సోదరులకు ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు, మౌజన్లకు కూడా జీతాలు అందజేసినట్లు తెలిపారు.

# వంట గ్యాస్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ



**ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు**

**కలెక్టరేట్ లో 9154970454తో కంట్రోల్ రూం**

**ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో వంట గ్యాస్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని.. ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు. శనివారం జేసీ ఇలక్కియ అధికారులతో కలిసి విజయవాడ ఆటోనగర్‌లోని మాధవ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని, హెచ్‌పీ గ్యాస్ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ సరఫరా ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ నిల్వలు అవసరం మేరకు ఉన్నాయని, సరఫరా వ్యవస్థను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు గ్యాస్ కొరతపై ఎలాంటి అపోహలకు లోనుకావద్దని, సాధారణ విధంగానే గ్యాస్ సరఫరా కొనసాగుతోందని తెలిపారు. గ్యాస్ ఏజెన్సీలు కూడా వినియోగదారులకు నిర్దేశ సమయానికి సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వంట గ్యాస్ సరఫరాకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే లేదా ఫిర్యాదులు ఉన్నట్లయితే జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఇందుకోసం 9154970454 ఫోన్ నంబర్‌తో కంట్రోల్ రూం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. జిల్లాలో గ్యాస్ సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగేందుకు ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రజలు అనవసరంగా గ్యాస్ నిల్వ చేసుకోవడం లేదా అపోహలను నమ్మడం వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశముందని, అందువల్ల అలాంటి చర్యలకు పాల్పడకూడదని జేసీ ఇలక్కియ విజ్ఞప్తి చేశారు. జేసీ వెంట డీఎస్‌వో పి.వాణి, ఏఎస్‌వో వి.శ్రీనివాస్, విజయవాడ తూర్పు తహసీల్దార్ ఆర్.రోహిణిదేవి తదితరులు ఉన్నారు.

# విజయవాడలో తొలి టెక్- ఎనేబుల్డ్ విద్యాపీఠ్ సెంటర్ ఏర్పాటు

## ఏపీలో తన ఆఫ్‌లైన్ ఉనికిని ప్రారంభించిన ఫిజిక్స్ వాలా



**విజయవాడ మేజర్ న్యూస్ :** విద్యా సంస్థ ఫిజిక్స్ వాలా విజయవాడ ఎంజీ రోడ్డు బెంజి సర్కిల్ వద్ద ఉన్న నూరాని ప్లాజా లో తన మొట్టమొదటి టెక్-ఎనేబుల్డ్ ఫిజిక్స్ వాలా విద్యాపీఠ్ సెంటర్‌ను ప్రారంభించడంతో ఆంధ్రప్రదేశ్‌లో తన ఉనికిని విస్తరించింది. తన తొలి టెక్-ఎనేబుల్డ్ ఫిజిక్స్‌వాలా విద్యాపీఠ్ సెంటర్‌ను ప్రారంభించి ఆంధ్రప్రదేశ్‌లో తన భౌతిక ఉనికిని విస్తరించింది. ఎస్.వి.పి అమిత్ సింగ్ రాథోడ్ ప్రారంభించిన ఈ కేంద్రంలో పలు టెక్-ఎనేబుల్డ్ తరగతి గదులు ఉండగా, ఇవి అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఫిజిక్స్‌వాలా విద్యాపీఠ్ కేంద్రాలు టెక్-ఎనేబుల్డ్ ఆఫ్‌లైన్ కేంద్రాలలో విద్యార్థులు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధించే వ్యక్తిగత తరగతులకు హాజరవుతారు. ఈ కేంద్రాలు జెఈఈ, నిట్, ఫౌండేషన్ కోసం సమగ్రమైన పాఠ్యాంశాలను, ఒలింపియాడ్‌లు వంటి విద్యా పరీక్షలపై దృష్టి సారిస్తాయి. రికార్డ్ చేసిన పాఠాలు, ఎన్ సి ఈ ఆర్ టి మెటీరియల్‌లతో సహాయం, ఆఫ్‌లైన్ సందేహ పరిష్కారం, రోజువారీ అభ్యాస సమస్యలు, ప్రత్యేక మాడ్యూల్స్, కార్యాచరణ-ఆధారిత అభ్యాసం, మునుపటి సంవత్సరం ప్రశ్నలు, సౌకర్యాలను అందిస్తాయి. ఈ కేంద్రాలలో స్టూడెంట్ సక్సెస్ టీమ్ కోసం ఒక ప్రత్యేక డెస్క్, విద్యార్థుల పురోగతిపై నవీకరణల కోసం పేరెంట్-టీచర్ డాష్‌బోర్డ్ వ్యవస్థ కూడా అందుబాటులో ఉంటుంది. విద్యాపీఠ్ ఆఫ్‌లైన్, ఫిజిక్స్ వాలా సీఈఓ అంకిత్ గుప్తా మాట్లాడుతూ, "ఫిజిక్స్‌వాలా లో విద్యార్థుల అభ్యాస అనుభవాన్ని మెరుగుపరచడానికి మార్గాలను కనుగొనేందుకు మేము ప్రయత్నిస్తుంటాము. నాణ్యమైన విద్య కోసం విద్యార్థులు ఇతర నగరాలకు ప్రయాణించాల్సిన అవసరం లేదని మేము విశ్వసిస్తున్నాము. ఎందుకంటే ఇది వారికి భావోద్వేగంగా, ఆర్థికంగా ఒత్తిడిని కలిగిస్తుంది. విజయవాడలో మా మొదటి ఫిజిక్స్‌వాలా విద్యాపీఠ్ కేంద్రాన్ని ప్రారంభించడం ద్వారా, సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్యను వారి ఇళ్లకు దగ్గరగా తీసుకురావాలని, దేశవ్యాప్తంగా మరిన్ని విద్యా కేంద్రాలను సృష్టించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము" అని వివరించారు.ప్రస్తుతం, ఫిజిక్స్ వాలా దేశవ్యాప్తంగా 215 విద్యాపీఠ్, పాఠశాల ట్యూషన్ కేంద్రాలను కలిగి ఉంది.

# నగరంలో సావిత్రి శారీస్ షోరూం ప్రారంభం



**విజయవాడ మేజర్ న్యూస్ :** బెంజ్ సర్కిల్ సమీపంలోని హెచ్డిఎఫ్సి బ్యాంక్ సమీపంలో నూతనంగా సావిత్రి శారీస్ షో రూమ్‌ను ఏర్పాటు చేశారు. డీసీపీ సరిత ముఖ్య అతిథిగా విచ్చేసి షోరూంను లాంఛనంగా ప్రారంభించారు అనంతరం షోరూంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల శారీస్ ను పరిశీలించారు. వాటి తయారీ వివరాలు,ధరల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హైద్రాబాద్‌లో సావిత్రి శారీస్‌కు ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని అన్నారు. ఎంతో మంది కష్టమర్ల ఆదరాభిమానాలతో దినదినాభివృద్ధి చెందుతోందని తెలిపారు. నేటితరం మహిళలు, యువతులు అత్యాధునిక డిజైన్స్ కోరుకుంటున్నారని వారి అభిరుచులకనుగునంగా శారీస్ ఒకే చోట అందుబాటులో ఉంచటం శుభపరిణామమని అన్నారు. అనంతరం షోరూం నిర్వాహకులు దామర్ల శివప్రసాద్, దామర్ల శార్వాణి మాట్లాడుతూ హైదరాబాద్ లోని కస్టమర్లకు వినూత్న డిజైన్స్ తో కూడిన శారీస్ అందిస్తున్నామని విజయవాడ నుంచి అధిక సంఖ్యలో కస్టమర్లు తమ షోరూంకు విచ్చేసి శారీస్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. హైద్రాబాద్ కు తమకంటూ ఒక గుర్తింపును తెచ్చుకున్నామని చెప్పారు.తామే నేతన్నలు దగ్గర శారీస్ డిజైన్ చేస్తామని, మరికొన్ని ఆర్డర్ ద్వారా శారీస్ తీసుకువస్తామని వివరించారు. తమ వద్ద 500 నుంచి లక్ష రూపాయలు విలువ చేసే కాటన్ శారీస్ తో పాటు డిజైనర్ శారీస్, పట్టు శారీస్ లభిస్తాయని చెప్పారు. నేటితరం మహిళలు యువతులు వారి అభిరుచులకనుగుణంగా అన్ని రకాల శారీస్ అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు. విజయవాడ నగర ప్రజలు ఒక్కసారి తమ షోరూమ్‌ను సందర్శించాలని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శారీస్ ను తిలకించాలని వారు కోరారు. తదనంతరం ప్రముఖ మహిళలు రమ రవి, జయ మాట్లాడుతూ తాము సావిత్రి శారీస్‌లోనే నిత్యం చీరలు కొనుగోలు చేస్తుంటున్నట్లు తెలిపారు. వివిధ రకాల డిజైన్స్‌తో కూడిన శారీస్ సావిత్రి షోరూంలో అందుబాటులో ఉంటాయని విజయవాడ నగరంలో కూడా షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.



## ఏపీ మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్ రెంటపల్లి శ్యామ్‌కు అభినందనలు

**అభినందించిన ముఠా వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు**

**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ఏపీ మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్ గా నియమితులైన టిఎన్‌టియూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి & జోన్ – 3 ఇంచార్జ్ రెంటపల్లి శ్యామ్‌ను శనివారం విజయ డైరీ (ఎంపీ ఎఫ్) ముఠా వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు ఇబ్రహీంపట్నం, గుంటుపల్లిలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రెంటపల్లి శ్యామ్‌ను దుశ్శాలువా, పుష్పగుచ్చాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయ మిల్క్ డైరీ (ఎంపీఎఫ్) ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు చప్పిడి రవీంద్ర, ప్రధాన కార్యదర్శి నరసింహారావు, కోశాధికారి ఆర్ సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శి నెర్జీ రామ సింహాచలం తదితరులు మాట్లాడుతూ రెంటపల్లి శ్యామ్ నిరంతరం కార్మిక సమస్యలపై పోరాటాలు చేస్తూ నాకు అండగా ఉంటున్న మా యూనియన్ గౌరవ అధ్యక్షులు రెంటపల్లి శ్యామ్కి ఈ పదవి రావడం మాకు ఎంతో ఆనందంగా ఉందని వారు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము అని శ్యామ్పై ఉన్న అభిమానాన్ని చాటుతూ వారి ఆనందాన్ని తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

**అభినందించిన ఏపీ జిల్లా నాయకులు కాజా కిరణ్ కుమార్**



ఏపీ మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన టిఎన్‌టియూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి & జోన్ – 3 ఇంచార్జ్ రెంటపల్లి శ్యామ్‌ను శనివారం బిజెపి జిల్లా నాయకులు కాజా కిరణ్ కుమార్, మాధవ రావు మర్యాదపూర్వకంగా కలిసి రెంటపల్లి శ్యామ్‌ను దుశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతన బస్సు షెల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని జువ్వనపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన బస్సు షెల్టర్‌ను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. గ్రామానికి చెందిన పాగోలు రాజ్ సౌమిత్ (మున్నా) దాతృత్వంతో ఈ షెల్టర్ నిర్మించడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేస్తూ దాతను అభినందించారు. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన ఈ షెల్టర్ ను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాత మున్నాతోపాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి పార్టీ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎస్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999